ఇల్లు కొన్నాడు

వర్షాకాలం; నిన్నటినుంచీ ముసురుగా ఉంది. ఇవాళ ఉదయం తుంపరగా ప్రారంభమై మధ్యాహ్నానికల్లా మరి జోరయింది వాన.

అప్పటిదాకా నిద్రపోయి, వాన ఎలా వుందో చూద్దామని ముందు గదిలోకి వచ్చిన చిదంబరానికి తెరచివున్న కిటికీలోంచి వాన జోరు గోచరించింది. పొరపాటు చేత కిటికీ తలుపులు తెరవబడి వున్నాయి. పడమటి జల్లుకు గది కొంత భాగం బాగా తడిసిపోయింది. పంచా, చొక్కా, తడుస్తూ వున్నా లెక్క చేయకుండా వెళ్ళి తలుపులు మూశాడు.

వాన తగ్గలేదు, యింకా తగ్గలేదు. ఇప్పుడు నాలుగయింది. ఇంకొంచెం సేపటిలో అయిదు, మరి కొంత సేపటిలో ఆరు. అంతలో చీకటిపడుతుంది. రాత్రి ప్రారంభమౌతుంది, తిరిగి రేపటి ఉదయంవరకు ఏ పని చేయడానికి వీలులేదు.

రెండు మూడు నిమిషాలు ఆయన విసుగ్గా ఆలోచిస్తూ నిలబడ్డాడు. అంతలో టప్‌మని ఒకనీటి బిందువు సరిగ్గా నెత్తి

మీద పడింది. వెనువెంటనే యింకొకటి, గ్రహించి, తలపై కెత్తేలోగా మరొకటి, తల ఎత్తి చూశాక యింకా ఒకటి సరిగ్గా యీసారి నోటిలోకి వచ్చి పడింది. తెరిచి వున్న నోట్లోకి. ఛీ చీదరంగా ఆయన రెండడుగులు యివతలకు వేశాడు. ఈ సారి భుజం తడిసింది. విసుక్కుని అవతలకు వెళ్లాడు. ఈమారు వీపు తడిసింది. చినుకులు! చినుకులు! చినుకులు!

గదంతా కురుస్తోనే ఉంది. ఎటు వెళ్ళినా తడిశాడు. నేలంతా తడిసిపోతోంది. గోడల మీదుగా నీళ్ళు కారిపోతున్నాయి. పై కప్పు అంతా తడిసి ముద్దయింది.

పూర్తిగా తడిసిపోయి కోపంగా లోపలకు వచ్చాడు. ఇల్లంతా నిర్మానుష్యంగా ఉంది. మూడేగదులు మొత్తం. ముందు గది గతి అలావుంది; మధ్యహాలు ఒకమాదిరిగా పరవాలేదు. మళ్ళీ వంటగది ఎంతోసేపు ఏడిచినట్లు చెమ్మగిలి ఉంది.

మధ్యహాల్లో పరచివున్న చాపమీద మళ్ళీ పడుకున్నాడు. చిదంబరం.

నీళ్ళు! నీళ్ళు! నీళ్ళుఎక్కడ చూసినా నీళ్ళు ఈ యింటి నిండా. ఈ ఇంట్లోనే కాదు యాభై అయిదేళ్ళ వయస్సు తనది. పుట్టి బుద్ధెరిగాక యింతకంటె మంచియింట్లో ఎప్పుడూ ఉండలేదు. తన జీవితమంతా యింతవరకూ అద్దెయిళ్ళలోనే బ్రతికాడు. ఇన్నాళ్లు అద్దెయిళ్ళ బ్రతుకుకే అలవాటు పడిపోయాడు. గదుల్లోకి ఎండవచ్చిన సహించాడు. వాన కురిసిన భరించాడు. ఖాళీ చేయమన్నప్పుడు ఖాళీ చేశాడు. ఎన్నో

ఇబ్బందులు పడ్డాడు. కొన్ని పదుల ఇళ్లు మారాడు. ఏనాడూ ఏ యింటిమీదా తనకు స్వాతంత్రం లేదు.

"ఈ యిల్లునాది, నాయిష్ట వచ్చినట్లు చేసుకుంటాను" అని ఆయన యెన్నడూ అనుకున్నా పాపన పోలేదు

"ఇది అద్దెయిల్లు-అద్దెయిల్లు" ఎప్పుడూ యీ భయమే. రాత్రిళ్లు ఎక్కువసేపు లైటు వెలిగిస్తే యింటి యజమానివచ్చి దెబ్బలాడేవాడు. తనదగ్గర ప్రయివేటు నేర్చుకునే పిల్లలు కొంచెం గొడవచేస్తే యింటి యజమాని ఆ యిల్లు ఖాళీ చేయమన్నాడు

కొన్ని కొన్ని ఇళ్ళలో యిష్టంవచ్చినప్పుడు బయటకు వెళ్ళటానికి వీలులేదు. ఇష్టంవచ్చినప్పుడు లోపలికి రావటానికి వీలులేదు. ఎదురింటి వాడితో జగడాలు, ప్రక్కయింటితో విరోధాలు. పంపుదగ్గర దెబ్బలాటలు, అద్దెదగ్గర దెబ్బలాటలు.

ఆజ్ఞలు, అసూయలు, వైషమ్యాలు, పగలు.

ఇంకా ఎన్ని? ఎన్ని?

ఆ దృశ్యాలన్నీ ఈనాడు తలలో తిరుగుతున్నాయి. ఎన్ని యిబ్బందులు పడ్డాడు? ఎందుకుపడ్డాడు? తనకు అద్దె ఎక్కువ యిచ్చే తాహతులేదు. చిన్న యిళ్ళే తీసుకోవాలి. [illegible] యిళ్ళలోనే కాపరం చెయ్యాలి. సరిపోకపోయినా సరిపెట్టుకోవాలి.

యాభయి అయిదేళ్ళ జీవితం తనది నిన్నగాక మొన్న రిటైరైన జీవితం తనది.

ఉద్యోగమే; బతకలేని బడిపంతులు పని.

అయిదువేలు అందిచ్చి తనను వదలిన బడిపంతులు పని.

ఇన్నాళ్ళయాక. జీవితం యింత మొద్దు బారాక అద్దె బ్రతుకు అలవాటు పడ్డాక మనసు యిప్పుడెందుకో తిరగబడు తోంది. ఉద్యోగంనుంచి స్వేచ్ఛ లభించింది. ఇహముందు ఈ మనిషి తెల్లవారు ఝామునే తప్పనిసరిగా మేల్కొనక్కర లేదు. కాలకృత్యాలు తీర్చుకొని ఆదరా బాదరాగా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని రెండుమైళ్ళదూరం కాళ్ళీడ్చు కుంటూ నడవనక్కర్లేదు. అధికార్ల చివాట్లు తిననక్కర్లేదు. రాత్రిళ్ళు పన్నెండువరకూ మేలుకుని కాంపోజిషన్ పుస్త కాలు దిద్దనక్కర్లేదు. అంతటితో ఆగక మనసు యింకా స్వేచ్ఛ వెదుకుతోంది. అద్దె బ్రతుకుకు స్వస్తి చెప్పాలని చూస్తోంది.

తనూ ఓ యిల్లు కొనాలి.

చిదాంబరానికి మేనంతా ఒక్కసారి గగుర్పొడిచింది. ఎంత తియ్యని అనుభూతి!

నిన్న తన స్నేహితుడు; అతనికీతనకీ పాతికేళ్ళ స్నేహం! అతనిది బ్రతికిచెడ్డ జీవితం—తన దగ్గరకు వచ్చి.

"నాకో సహాయం చెయ్యాలి!" అన్నాడు.

"ఏమిటి?"

"చేస్తావా?"

అప్పుడే భయం మొదలు పెట్టింది. ఏ సహాయం చేయ గలడు తను? అశక్తుడే.

"చెప్పు" గొణుగుతున్నాడు.

"నాకు డబ్బు కావాలి"

"ఎంత?"

అతను వికటంగానవ్వి అన్నాడు. జుట్టు నెరసినా, శరీరం ముడతలుపడినా, జరం పీడిస్తున్నా అతని నవ్వు ఇంకా యౌవనపు తీవిలోనే ఉంది. బ్రతికిచెడ్డవారి నవ్వులు అలానే ఉంటాయి కాబోలు.

"నాకు ఎంతయినా అవసరం ఉంది. కాని అంత నా కెవ్వరివ్వగలరు ?" కాని తాను కొంతయినా యివ్వలేడుగా—

"నాదగ్గ రెక్కడుంది ?"

"విను" అంటూవచ్చిన స్నేహితుడు తాపీగా అన్నాడు.

"మా తండ్రి తండ్రి రాజా బ్రతుకు బ్రతికాడు. మా తండ్రీ అంతే నేనూ అంతే. కానీ వాళ్ళంతా రాజా చావే చచ్చారు. నాకా అదృష్టం లేకపోయింది. నా ఆస్తంతా యిప్పటికే నశించింది. ఒక్కరోజు తినటానికి తిండి కూడా వుండదు. నా దుస్తులు మాయగా ఎప్పుడైనా నువ్వు చూశావా ? ఇప్పుడూ చూడవు. లోకానికి దరిద్రుడుగా కని పించటం భరించలేక యిలా దొంగబ్రతుకు బ్రతుకుతున్నాను. నువ్వు నా ఆప్త మిత్రుడివి. కాబట్టి చెబుతున్నాను నీ ముందు నేనేటువంటి రహస్యమూ దాచను. నీ ముందు మాత్రం నాకు సిగ్గూ, అభిమానంలేవు చంటి పిల్లకు జబ్బుచేస్తే చిన్నమందు యిప్పించేందుకు కూడా చేతిలో దమ్మిడీ లేకపోయింది." కంఠస్వరం వొణుకుతోంది. వేడినిట్టూర్పు చలిగాలిలో కలిసి పోయింది. "ఈ బ్రతుకు దుర్భరంగా వుంది. పదిమందిలో నా పరువు ఎలా పోగొట్టుకోను. ఇహ యీ వూళ్లో నిలువలేను. నాకు....నాకు....మిగిలింది ఒక్క యిల్లే. అది అమ్మేద్దామను కుంటున్నాను."

భుజాలెగురవేశాడు తను. ఏంచేయగలడు తను?

"పరాయివాడికి బేరంపెట్టి నా పరువు ప్రతిష్ఠల్ని వేలం వేసుకోలేను. నువ్వే నన్ను కాపాడాలి ?"

ఏమాశ్చర్యం ? ఎటువంటివాడు తనని వచ్చి బ్రతిమాలుతున్నాడు ? కాపాడగలిగే శక్తి తనకు వుందా ?

"నీకు ప్రావిడెంట్ ఫండ్ వచ్చింది కదూ?"

తల వూపక తప్పలేదు.

"ఎంత ?"

"అయిదువేలు"

"నేను చెప్పేది బాగా ఆలోచించు. నా యిల్లు నువ్వు చూశావుగా. దాని ఖరీదు యెంత చేస్తుందో కూడా ఆలోచిస్తే నీకు తెలియకపోదు. ఇంకా ఎలాగయినా మూడువేలు సంపాదించు. నీకిచ్చేస్తాను."

"నాకెందుకు యిల్లు?" అని చిదంబరం గొణిగాడు.

"ఎందుకేమిటీ ? ఈ రోజుల్లో స్వంత యిల్లు వుండటం కన్నా వేరే సౌఖ్యం ఏముంది ? నాలో నమ్మకముంటే నా మాటల్ని విశ్వసించు. నాకు వేరే గత్యంతరంలేక యిల్లు అమ్ముకుంటున్నా కాని మరేంలేదు. నేను ఎటువంటివాడినో నీకు తెలిసివుండకపోదు. నన్ను బహిరంగపరచి, నలుగురిలో నవ్వులపాలు చేయడం నీకిష్టమా ఏమిటి ?"

తల అడ్డంగా తిప్పాడు.

"ఏం ? మరి బేరానికి పెడితే నేను చెప్పిన ధరకన్నా యింకో రెండు మూడు వేలు యెక్కువ రాకపోవు. కాని నా పరువూ, మర్యాదా...."

ఎప్పుడూ యిదే మాట. ఈ లోకంలో యితనికి యీ రెండే ప్రీతి అయిన పదార్థాలు కాబోలు.

"ఏమంటావు ?"

ఏమనాలి ? ఈ డబ్బు వచ్చిన దగ్గర నుంచీ యేం చెయ్యాలో తనకూ బోధపడ్డంలేదు. వడ్డీకి తిప్పుదామని ముందు అనుకున్నాడు. కానీ ఆవ్యాపారం తనకేం చాతవును? తన దృష్టిలో యింకా రెండు మూడున్నాయి.

ఏమీ పాలుపోవడంలేదు. భార్య సలహా తీసుకోటానికి భయం. ఆడవాళ్ళ తెలివితేటల్లో తనకంత నమ్మకంలేదు. ఇప్పుడు హఠాత్తుగా యీ చిరకాల మిత్రుడు నూతన సమస్య తెచ్చిపెట్టాడు. ఇందులో లాభం వుందో, నష్టం వుందో, తనకేం తెలుసు ? వ్యవహారాలు తనకు అంతగా తెలియవు.

"ఆలోచించాలి"

"ఆలోచించు. ఒక గంటసేపు టైము యిచ్చాను."

బ్రతికి చెడిన వాళ్ళ మాటలు యిలానే వుంటాయి కాబోలు.

"గంటా ?" అని తెల్లబోయి "కాదు. రేపు చెబుతాగా" అని అప్పటికి తప్పించుకొన్నాడు.

"రేపు సాయంత్రం మీ యింటికొస్తాను. అర్జంటయిన విషయం సుమా !"

"ఎందుకు ? నేనే వచ్చి ఏ సంగతి చెబుతాను."

అతను వెళ్ళిపోయాడు.

రాత్రంతా ఆలోచనలు ఒకానొక పెద్ద సమస్య.

ఎలా పరిష్కరించాలి. ఆ మాటలు స్నేహితుడి నోటిలోంచి విన్నప్పుడు ఎక్కువ చలించలేదుగాని, లోతుగా ఆలోచించిన కొద్దీ ఊహలన్నీ హాయిగా, తీయగా వున్నాయి. స్వంత యిల్లు. ఇన్నాళ్ళకు ఓ స్వంత యిల్లు ఎడా తెరపీ

లేకుండా అద్దె యిళ్ళలో గడపిన వ్యక్తికి, స్వంత యిల్లంటూ రావటం ఎంత అనుభూతీ మొదట కొద్దిగా భయం. తరువాత ఆందోళన. ఆ తరువాత కుతూహలం. యింకా తరువాత ఆనందం - యివన్నీ కలుగుతున్నాయి.

ఇన్ని మెట్ల తరువాత ఉంది ఆనందం. యింటి యజమాని అయితే అంత ఆనందమూ అనుభవించ వచ్చునన్నమాట.

చివరకు కొందామనే కోరికే బలమవుతోంది. కాని అంత డబ్బు తను భరించగలడా మూడువేలు అప్పు అసంభం.

రాత్రంతా కలిగిన ఆలోచన ఫలితమే యీనాటి దృఢ నిశ్చయం. అందుకే యీ ఆదుర్దాను అణచుకోవటం కష్టంగా ఉంది. పాడు వర్షం పగ సాధిస్తోంది. ఈ వానలో ఎలా తడిసి బయటికిపోయి అతని కీ విషయం వెల్లడించటం.

ఒక్క రోజులో పుట్టి పెరిగిన వాంఛకు ఎంత బలం ? తనని యింత ఆకర్షణలో పెట్టిందీ మిగతా విషయాలపట్ల శ్రద్ధను పూర్తిగా విస్మరింప చేసిందీ.

అంతేకాదు ఎన్నడూ ఇంత చిరాకు పడలేదు. ఈరోజు ఈ అద్దె యింటిమీద ఎనలేని అసహ్యాం కలుగుతోంది.

ఈ యింట్లో పంపులేదు. బావినీళ్లే గతి. ఎలక్ట్రిసిటీ లేదు. వానవస్తే యిల్లంతా తడుస్తుంది చెప్పలేని యిరుకు. ఇన్నాళ్లు ఈ యింట్లో తనూ, భార్యా, పిల్లలు యింతమంది కాపురమున్నారా ? అమ్మకానికి వచ్చినయిల్లు తనకు పరిచితం ఇంతకూ మూడురేట్లు వుంటుంది. డాబా యిల్లు, ఎలక్ట్రిసిటీ పంపు యీ సౌకర్యాలన్నీ వున్నాయి. మంచి లొకాలిటీ, ఇంత కన్నా ఏంకావాలి ? అంతేకాదు తాము కాపుర ముండగా మరొకరికి అద్దెకుకూడా యివ్వవచ్చు.

ఏమిటీ? తను యిల్లు అద్దెకు యిస్తున్నాడా?

వళ్లు పులకరించింది. ఆనందభాష్పాలు రాలటానికి ఆట్టే వ్యవధిలేదు. ఎంతటి ఘనకార్యం చేయబోతున్నాడు? తను ఓ యింటి యజమాని అవుతున్నాడు. తన యిల్లు అద్దెకిస్తున్నాడు. తనచుట్టూ అద్దె కిమ్మని అనేకమంది ప్రాధేయపడి తిరుగుతారు ఎంత కథా! కమామిషూ! వీధి తలుపు ఎవరో తట్టినట్లు అనుమానం కలిగింది ఈ వానలో తన యింటికి ఎవరు వస్తారనే అపనమ్మకంతో లేవలేదు. రెండు నిముషాలాగి తలుపు మళ్ళీ అస్పష్టంగా మోగింది. అనుమానం తీరింది. తన తలుపే, ఆ కొట్టేవాడు స్పష్టంగా కొట్టరాదూ? ఆయన లేచివెళ్ళి తలుపు తీశాడు. చప్పున జల్లు లోపలకు వచ్చింది సన్నని, పొడుగాటి వ్యక్తి గుమ్మంలో నిలబడి వున్నాడు. చేతిలో గొడుగు, చిదంబరం వెంటనే సంతోషంతో "ఓ లోపలకు రా" అన్నాడు ఆ వ్యక్తి లోపలకు వచ్చాక తలుపు మూశాడు.

ఇద్దరూ పోయి చాపమీద కూర్చున్నాక ఆ వ్యక్తి "ఏ మాలోచించావు"— అన్నాడు

వస్తూనే వ్యవహారములోకి లాగుతున్నాడు. ఎంత ధీమా?

తనూ సూటిగానే మాట్లాడాలి. మొహమాటం కూడదు. స్నేహాన్ని కొంతసేపు అవతలకు నెట్టాలి. నేర్పు కావాలి.

"అంత యివ్వలేను."

"ఎనిమిది వేలు"

"అవును"

అతను ఓ సారి వికటగా నవ్వి "అంత ఇంటిని ఎనిమిది వేలకు తక్కువ కొనటానికి ఎలా ఆశించావు?" అన్నాడు.

"నా శక్తికి మించిన పని చెయ్యలేను"

"అప్పు చెయ్యి"

"ఎంతని మూడువేలా! నావల్లకాదు."

"పోనీ ఎంతకు కొందామనుకుంటున్నావు ?"

"ఆరువేలకన్నా దమ్మిడీ ఎక్కువ యిచ్చుకోలేను."

అతను వెంటనే లేచి నిలబడ్డాడు. "ఆశకు అంతం ఉండాలి సరే నీ ఉపకారాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానులే. తప్పేదేముంది? నా పరువు ప్రతిష్టల్ని వేలం వేస్తాను." అన్నాడు.

"అదిచాలా పాత యిల్లు" అని చిదంబరం హీనస్వరంతో గొణిగాడు.

"అయినా ఎనిమిదికంటే ఎక్కువ విలువే చేస్తుంది."

చిదంబరం మౌనం వహించాడు. "సరే-అయితే వెడుతున్నాను-" అని రెండు మూడు అడుగులు వేసాడు.

వెళ్ళిపోతున్నాడే - తన కలలు !

దురాశ పీడిస్తోంది "పోనీ ఇంకో అయిదు వందలు."

"లాభంలేదు"

వెళ్ళిపోతున్నాడు. చిదంబరానికి కోపం వచ్చింది. పౌరుషంతో కూడిన కోపం కాదు యిది. నిరాశవల్ల కలిగినకోపం, దుఃఖపూరితమైన కోపం.

"నాకు అక్కర్లేదు. వెళ్ళిపో" అని అరిచాడు. మళ్ళీ అన్నాడు. "నీ స్థితే నీకు తెలుసు. ఇవతలవాడి సాధక బాధ

కాలు నీకు అక్కర్లేదా ? అంత నిర్లక్ష్యమా ! మూడు వేలు నే తెస్తే ఎలా తీర్చేది ?"

పోబోతున్నవాడల్లా ఆగి, వెనక్కి తిరిగి వచ్చాడు. ఎంత గాంభీర్యం ఆ చూపుల్లో; "సరే, అంగీకరించాను."

చిదంబరం సంతోషంతో లేచి నిలబడ్డాడు.

అతను చేయి జాపి, "అయిదువేలు ముందు తే"

రాజా మాటలు, మాటల్లో ధీమాకు తక్కువ లేదు.

కాని చిదంబరం తట్టుకుని "నాదగ్గ రెక్కడున్నాయి ? బ్యాంకిలో వేశాను రేపు పైసలు చేసుకుందాం కాని...." ....అని సందిగ్ధంతో ఆగాడు.

"ఏమిటి ?"

"నాకు పదిహేను వందలు ఎవరిస్తారు ?"

"ఆ పూచీ నాది. ఇంటి తాకట్టుమీదే నీ కిప్పిస్తాను."

"తాకట్టా ?" అని చిదంబరం నివ్వెరపోయాడు.

"అవును భయమేముంది? నెమ్మదిమీద తీర్చుకోవచ్చు.

మనసు పనిచేయటం మానింది. ఎలాగూ రంగంలోకి దిగాడు. ఏం జరుగుతుందో జరగనియ్యి.

"సరే. రేపు వుదయం వస్తాను" అని వెళ్ళిపోయాడు. చిదంబరం మళ్ళీ చాపమీద కూలబడ్డాడు.

ఇన్ని ఆలోచనలు భరించటమెలా? ఒకటే .... ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. భయాన్ని కలిగిస్తోంది. ఇంత పెద్ద విషయాన్ని, ఎవరికీ చెప్పకుండా, స్వంతంగా, ఇంత తేలికగా ఎలా పరిష్కరించుకున్నాడు. ఈ ధైర్యం తనకి ఎలా వచ్చింది.

జవాబు లేదు. జవాబు రాదు.

* * *

ముచ్చటగా మూడు రోజులలో వ్యవహారమంతా ముగింపుకు వచ్చింది. ఇల్లు కొంత బాగుచేయవల్సింది వుంది. అందువల్ల అప్పు రెండువేల వరకూ ఎగబ్రాకింది. మూడవ రోజుకు యిల్లు చిదంబరం స్వాధీనమైంది. ఈ విషయం ఆయన భార్యకూ తెలియదు. పిల్లలకు తెలియదు పెళ్ళికి వెళ్ళినవాళ్లు తిరిగి వచ్చేటప్పటికి కనీసం యింకో మూడురోజులు పడుతుంది. వాళ్ళు యిక్కడకు వచ్చి ఆశ్చర్యపోవాలి. అభినందించాలి. తర్వాత సుఖించాలి.

ఇలు ఖాళీ అయింది. తన చేతిలోకి వచ్చింది. దీనికి మరమ్మతు చేయవలసిన అవసరం వుంది. ఆపనికూడా భార్యా పిల్లలూ వచ్చేలోగానే సంపూర్తి చెయ్యాలి.

ఈ మూడు రోజులు ఆయన నిద్రాహారాలు లేకుండా కష్టపడ్డాడు. క్రొత్త యింటికి మరింత అందం అంటగడ్తు న్నాడు. చాలమంది మిత్రులు యింటికివచ్చి అభినందించి వెడుతున్నారు. తనతో పనిచేసిన వాళ్ళలో, తన స్నేహితుల్లో ఎవరికి వుంది స్వంతయిల్లు ?

మరమ్మతు పూర్తి అయ్యాక డాబామీద నిల్చుని గర్వంగా, నలువైపులా చూశాడు. ఎటువంటి పరిసరాలు!

ఇహ ముందు తను అద్దెయింటి బాధ పడనక్కర్లేదు.

"ఇంకా కొన్నాళ్ళు పోనీయండి." అని ఎవరినీ ప్రాధేయ పడనక్కర్లేదు. చాలీచాలని దీపం వెల్తురులో చత్వారపు కళ్ళతో పుస్తకాలు చదువలేక యిబ్బంది పడన క్కర్లేదు. నీళ్ళకోసం బావిదగ్గర అవస్త పడనక్కర్లేదు. ఇహ ముందు తన యింట్లో వాన కురవదు.

ఇహాముందు తన మనశ్శాంతికి కొదువలేదు.

తన పిల్లలందరూ ఒకే చాపమీద పడి దొర్లరు, యిల్లు చాలటంలేదని భార్య విసుగుకోదు, ఎంత శాంతి!! ఎంత హాయి? ఎంత సౌఖ్యం?

ఈస్థితిలో వెలువడే నిట్టూర్పులో ఎంత సొగసు ఉంది? ఇటువంటి స్థితిలో నడచిన నడకలో ఎంం ఠీవి ఉంది?

ఇట్టి స్థితిలో నవ్వే నవ్వులో ఎంత గాంభీర్యం ఉంది? ఎంత కమ్మని అనుభూతి? యాభయి అయిదేళ్ళ తరువాత ఎంతటి ప్రయోజకుడయ్యాడు.

తను యిల్లు కొన్నాడు.

తన యిల్లు అద్దెకిస్తాడు.

ఆ రోజే కాదు. యీ విధమైన ఆలోచనలతో మరో రెండు రోజులు గడిచాయి. ఓరోజు ఆయన యిదివరకటి యింటిముందు బండి వచ్చి ఆగింది. అందులోంచి నలభయి అయిదేళ్ళ ముత్తయిదువ, ఇరవై రెండేళ్ళ యువకుడు పదహారేళ్ళ అమ్మాయి, ఇద్దరు చిన్నపిల్లలు, ఒక చిన్న పిల్ల తోసహా దిగారు. వారు దిగేసరికి ఆయింటికి తాళం పెట్టి వుంది.

"ఎక్కడికో పోయార్రా అబ్బాయి." అంది ఆవిడ.

అతను చికాకు పడడం ప్రారంభించాడు. ముసలాయనకి యీ వేళకాని వేళలో పెత్తనాలు ఏమిటి? తిని యింట్లో హాయిగా పడుకోరాదూ? రాత్రంతా చచ్చీచెడీ ప్రయాణం చేసివచ్చి. యిప్పుడింటి బయట ఎవరు పడిగాపులు కాస్తారు? గొణగటం మొదలు పెట్టాడు. తండ్రి ఏమాత్రం పొరపాటు చేసినా సహించటం అలవాటులేని పద్ధతి అతనిది. పిల్లలు ఎక్కువసేపు "ఆకలో" అని గోలచెయ్యకుండానే తల్లి

మరింత విసుక్కోకుండానే యువకుడి సణుగుడు తిట్లలోకి ఇంకా మారకుండానే చిదంబరం అక్కడికి అవతరించాడు.

"ఉత్తరం రాయకుండా యెందుకు వచ్చారే?" అన్నాడు.

"బాగుంది! నిర్వాకం. తొందరగా తాళం తియ్యండి" అందావిడ. మరో రెండు నిముషాల్లో అంతా లోపలకు చేరుకున్నారు.

'ఎలా జరిగింది పెళ్ళి?' అని ప్రశ్నించాడు చిదంబరం.

"పెళ్ళికేం? నిక్షేపంలా జరిగింది! మీరు రాలేదని వాళ్ళంతా ఒకటే దెప్పిపొడిచారు" అంది భార్య.

"రెండు సంవత్సరాల క్రితం అతనంతమాట అన్నాక నాకు రాబుద్ధిపుట్టలేదు."

"చాల్లెండి? అతనింకా మనసులో ఆ విషయం పెట్టుకుని కూర్చున్నాడనే అంటారేవిటి?" అని ఆవిడ కాళ్ళు చేతులు కడుక్కునేందుకు లోపలకు పోయింది.

తర్వాత చాలసేపు పెళ్ళి కబుర్లలో అంతా మునిగిపోయారు. చిదంబరం యింకా ఆ విషయం బయటపెట్టలేదు.

హఠాత్తుగా వెల్లడించి వాళ్ళందరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచివేద్దామని ఆయన ఉద్దేశం. తర్వాత ఆవిడ వంట ప్రయత్నంలో మునిగిపోయింది. వంటచేస్తుంటే చిదంబరం అక్కడికి ఓసారి వచ్చిచూశాడు. పెద్దకూతురు తల్లికివంటలో సాయం చేస్తోంది. చాలీ చాలని వంటిల్లు, బోలెడు సామాను. మనిషి కదలటానికి కూడా వీలులేనంత యిరుకు. అట్లా యిబ్బంది పడుతున్న భార్యమీద చెప్పలేని జాలి పుట్టుకొచ్చింది ఆయనకు.

భోజనం చేస్తుండగా భార్య అంది హఠాత్తుగా "అన్నట్టు చెప్పటం మరచిపోయానండోయ్. కొంప మునిగింది!" అన్నది.

చిదంబరం ఉలుక్కుపడి "ఏమిటి?" అన్నాడు.

అంతవరకూ గుమ్మందగ్గర నిలబడివున్న పెద్దమ్మాయి దబ్బున లోపలకు వెళ్ళిపోయింది.

"కట్నం యివ్వందే వాళ్ళు జానకిని చేసుకోరుట"

చిదంబరానికి ముద్ద మింగుడు పడలేదు. ఒక్కక్షణంలో ముఖమంతా వివర్ణమైంది. గబగబ మంచినీళ్లు తాగి "మరి మొన్నటిదాకా అలా అనలేదుగా?" అన్నాడు.

"కట్నమిస్తామంటూ వాళ్ళ కింతకంటె మంచిసంబంధా లొస్తున్నాయట"

చిదంబరానికి తల తిరిగినట్టయింది. ఏమిటీ దుర్వార్త? ఇంతవరకూ కూతురి పెళ్ళిగురించి తనకేటువంటి చింతాలేదను కున్నాడు. దమ్మిడీ కట్నమివ్వకుండా సంబంధం సిద్ధంగావుందని సంతోషించాడు. కాని చివరకు కథ యిలా అడ్డం తిరిగిందా? తన పరిస్థితి తెలిసికూడా అలా అడిగేందుకు వాళ్ళకు మన సెలా వొప్పింది?

"నువ్వేమన్నావు?" అన్నాడు కీచు గొంతుకతో.

"బ్రతిమలాడి భంగపడ్డాను."

"మరి, యిప్పుడెలాగే?" అన్నాడు చిదంబరం దిగు లుగా.

కొంచెం ఆగి ఆవిడ అసలు విషయం మెల్లగా బయట పెట్టింది:

"వాళ్ళంటారూ మొన్ననేకదా - "అదేమిటమ్మా ఆ

ఫండ్, నోరు తిరగదు నాకు. అయిదువేలు వచ్చిందికదా! కూతురి పెళ్ళికోసం ఆమాత్రం ఖర్చు చేయలేడా?" అని.

చిదంబరం నెత్తిమీగ పిడుగు పడ్డట్లయింది. బంధువులు అనుకున్న వాళ్లు చివరకు యింతటి కుతంత్రానికి పూను కొన్నారా? ఎంత దారుణం?

"దమ్మిడీ యిచ్చేది లేదు!"

ఈయన ధోరణి చూసి, ముందు భార్య కొంచెం బెదిరినా, తర్వాత తెలివిగా అంది! "మనం కూడా అలా పట్టుబడితే ఎలా? ఆడపిల్లలు కలవాళ్ళం."

"అయితే అడుగులకు మడుగు లొత్తాలా?"

"అదికాదు. నేననేది మనం ఒకమెట్టుక్రింద వుండాలి."

"ఇవన్నీ నాకు తెలుసు. చస్తే నేను కట్నం యివ్వను."

అంత పట్టుదల అయితే ఎలాగండీ? మనమ్మాయి పెళ్ళికావటం మనకు ముఖ్యం కాదా?"

"అయినప్పుడే అవుతుంది. కట్నం యివ్వకుండా చేసు కునేవాడు వచ్చినప్పుడే చేస్తాను."

"అవన్నీ కలలో మాటలు. ఇంత దగ్గర సంబంధం వొదులుకుంటే మళ్లీ మనతరంకాదు దాని పెళ్ళిచేయటం."

చిదంబరం విసుగ్గా "అయినా నా దగ్గర డబ్బేదే?" అన్నాడు.

"అదేమిటి? అయిదువేలూ...."

"ఇల్లు కొన్నాను." మానవుడు నోరు జారాడు.

వడ్డిస్తున్న భార్యా, తలవంచుకు తింటూన్న పెద్ద కొడుకూ, గోడ చాటునుంచి వింటూన్న పెద్దకూతురు ఒక్క సారిగా కొయ్యబారిపోయారు.

చిదంబరం నాలిక కొరుక్కుంటున్నాడు. చెప్పకతప్పని విషయమే, ఎటువంటి పరిస్థితుల్లో చెబుదామనుకున్నాడు. ఎటువంటి స్థితిలో చెప్పాడు. ఒక్కసారిగా వాళ్ళందరి హృదయాలకూ, కొరడా చురుకు అంటించాడే? వాళ్ళలా తెల్లబోవటం, ఆ ముఖాల పేలవం తనకు మరీ హృదయ విదారకంగా ఉంది. ఇహ యీ అన్నం నోట్లోకి ఎలా పోతుంది? ఇక్కడినుంచి చప్పునపోయి ఎక్కడైనా దాక్కుంటే బాగుండును. ఇహ అనుకోని సంఘటనలు ఎదురౌతాయి కాబోలు. ఎటువంటి ఘాతాన్ని కలిగించే మాటలు వినిపిస్తవో.

నిశ్శబ్దం – రెండు....మూడు క్షణాలు భయంకరమైన నిశ్శబ్దం.

"ఇలా ఎందుకు చేశారండీ?" అంది ఆవిడ. "నాతో ఒక మాటయినా చెప్పకుండా కొంప కూల్చారే!"

చిదంబరానికి కోపం వచ్చింది. అసమర్థతతో కూడిన కోపంతో "కొంప కూలవలేదు. కొంప కొన్నాను."

భార్య వెంటనే అందుకుంది. "ఎవరికోసం? ఏ సుఖం కోసం?"

"ఏ సుఖం కోసమా?" చిదంబరం కటువుగా అన్నాడు. "ఇన్నేళ్ళు వచ్చాక ఆ విషయం నీకు చెప్పాలన్నమాట. ఆహా! నీ బుద్ధి చూపించావే! ఇన్నాళ్ళు నా రక్తంవోడ్చి సంపాదించాను. మీ అందర్నీ పోషించాను. వీడు పెద్దవాడయ్యాడు. ప్రయోజకుడయ్యాడు. నెలకో నూటయాభై తెస్తున్నాడు. ఇప్పటికైనా నేను సుఖానికి నోచుకోలేదా?"

"ఎవరు వద్దన్నారు? కాలు మీద కాలు వేసుకుని కూర్చోండి మహారాజులాగ. కాని యిదేంపని - ఎవరితో చెప్పాపెట్టకుండా!"

ఆయన ఈసారి ఆకాశ మండలానికి లేచాడు. "ఏమిటే నీకు చెప్పేది? నీ బోడి సలహా చెబుతావనేనా? ఆ మాత్రం తెలివితేటలు నాకూ లేకపోలేదు. డబ్బుని ఏ విధంగా సద్వినియోగం చెయ్యాలో నాకూ తెలుసు ఇంకా...." అని గద్గదికంగా "యిలా అద్దె యిళ్ళలో పడివుండి వాళ్ళచేత వీళ్ళచేత మాటలు పడమన్నావా? ఎవడైనా చుట్టంవస్తే కదిలేందుకు మెదిలేందుకు కూడా చోటులేని ఈ కొంపలో కుళ్ళి కుళ్ళి జీవించమంటావా? ఇన్నాళ్ళు వుద్యోగం చేశాను. ఇంత అనుభవం సంపాదించాను. నాకు తెలుసంటావా? నీకు తెలుసంటావా? కష్టపడి సంపాయించిన డబ్బుతో యిల్లు కొని అందులో హాయిగా ఉందామంటే మీకు కంటగింపైందీ? ఈ సమయంలో కాకపోతే సప్తజన్మాలకైనా అటువంటి ఇల్లు కొనగలుగుతామా?"

ఆ తరువాత మాటలు పెగల్లేదు. ఆ సన్నివేశంలో మరి అక్కడ నిలువగలగటం అసంభవం. బయటకు నడవటం మిగిలింది. అదే చేయగలిగాడు.

బయట తిరిగాడు. ఆలోచన్లు అలుముకున్నాయి.

ఎంతపని చేశాడు? ఆ విధమైన ఉద్రేకం ఎందుకు ప్రదర్శించాడు?

నిజంగా అది నిజమైన ఉద్రేకమేనా? కాజాలదు. చ్చిపెట్టుకున్నదీ కాదు. అంత కృత్రిమ ఉద్రేకాన్ని ప్రద

ర్శించే అవసరం తనకులేదు. ఏదో భావాన్ని ఉద్రేకరూపంలో చూపించాడంతే.

భార్యతో ఇలా మాట్లాడటం మంచిదో, కాదో తనకు తెలియలేదు. కాని ఆ సంభాషణ యింట్లో చాలా గొడవ లేవదీయగలదని మాత్రం ఊహించగలడు. కన్నీళ్ళకు కొదవ ఉండదు. ఊహ తెలిసిన ఆడవాళ్ళు ఒకరికి యిద్దరున్నారు. గనుక నిజానికి ఆలోచిస్తే తను చేసిన తప్పేమిటో కూడా బోధపడటంలేదు. బహుశా కొద్ది రోజుల్లో తన మాటల్లోని సత్యం వాళ్ళే తెలుసుకుంటారు. నిజానిజాలు ఇప్పుడే బోధపడుతున్నాయి కొడుక్కి కూడా కోపం రావడం అసహజం కాదు. ఇంటికీ ఆఫీసుకూ ఎంతో దూరం సైకిల్ కొనుక్కోవాలని వాడు చాలా కాలం నుంచీ అభిప్రాయపడుతున్నాడు. ఆ కోరిక రెండు మూడుసార్లు పరోక్షంగా తెలియపర్చాడు కూడా. ఈ విషయాన్ని తను పూర్తిగా విస్మరించాడు. మనసులో వాడు చాల మథనపడుతూ ఉండాలి.

అదీగాక భార్య ఈ విషయానికీ, కూతురు పెళ్ళికీ ముడి పెడుతుందనీ తను కలగనలేదే.

చిదంబరం ఆ మధ్యాహ్నం ఇంటికిపోలేదు. ఎంత అరికట్టుకుందామన్నా ఏదో తెలియని భయం వెన్నాడుతూనే ఉంది. తను చేయని తప్పుకు. కొన్ని గంటల క్రితం వరకూ ఘనకార్యం అని వుప్పొంగిన పనికి, ఈ క్షణాలో భయపడుతున్నాడు, బెదురుతున్నాడు, చలిస్తున్నాడు. కాళ్ళలో మునుపున్న బలంలేదు ఎక్కువదూరం తిరగలేడు. మనసుకి, నిగ్రహశక్తి లేదు. స్నేహితుల ఇళ్ళలో ఎక్కువసేపు గడపలేడు.

కాబట్టి రాత్రి ఏడు అయేసరికి తిరిగి యింటికి చేరాడు.

కొడుకు యింట్లోనే వున్నాడు. తలయెత్తి తననుచూడ లేదు.

ఎందుకు వాడికంత కసి? వాడి మదిలో యింకా తీరని కోరికలు ఏమయినా వున్నాయా? మాట్లాడకుండాపోయి కాళ్ళు చేతులు కడుక్కువచ్చాడు. వడ్డించసాగింది! ఆమె. ఇద్దరిలో ఎవరూ మాట్లాడుటలేదు.

జరిగిపోయిన విషయాన్ని గురించి రేపితే ఉదయంలా, తను మళ్ళీ ఎంగిలి చేత్తోనే నడుస్తాడని ఆవిడకు భయం కాబోలు.

భోజనం అయ్యాక, చేతులు కడుక్కొని, తువ్వాలుతో తుడుచుకుంటుండగా వెనకనుంచి వచ్చింది.

“ఏ యిల్లు కొన్నారు?” నిదానంగా ఉంది కంఠస్వరం.

“గోవిందరావుగారిది.”

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

“ఎంత?”

“ఆ....” అప్పుచేశానని చెప్పటానికి నాలిక జంకింది. ఈ నిజం చెప్పటానికి పూర్తిగా అధీరుడయ్యాడు.

“అయిదువేలు సరిగ్గా”

ఆమె ఏమీ మాట్లాడక పోయేసరికి మళ్ళీ తనే, “ఎల్లుండి మంచిరోజు, గృహప్రవేశం” అన్నాడు. తలవూపి ఆవిడ లోపలకు వెళ్ళిపోయింది.

* * *

స్వంత యింట్లోకి ప్రవేశించి పక్షంరోజులు గడిచాయి. మానసిక బాధలు మళ్ళీ అంతరిస్తున్నాయి. మాసిపోయిన గర్వం, ఆనందం మళ్ళీ చిగురిస్తున్నాయి

కథా నిలయం
1001

ఓరోజు "ఈ భాగము అద్దెకివ్వాబడును" అని తనే స్వంతంగా కూర్చుని ఓపిగ్గా బోర్డు రాశాడు. దాన్ని గోడకు తగిలించి దానివంక ఓసారి నిటారుగా చూసి హాయిగా నవ్వు కున్నాడు.

ఇహ రేపటినుంచీ తనయింటిచుట్టూ అద్దెకోసం మనుషులు విసుగు లేకుండా తిరుగుతారు కాబోలు. వాళ్ళు అద్దె తగ్గించమని తనని బ్రతిమలాడుతారు కాబోలు.

ఒకభాగం తమ కుటుంబానికిచాలు. ఎడమవైపువున్న చిన్నభాగం అద్దెకు యివ్వాబడుతుంది

"ఈ భాగం అద్దెకు యివ్వాబడును."

ఈ భాగం తన స్వంతం. తనకు సామాన్యంగానే కనబడుతోంది. కానీ కొంతమందికి యిది దాహంవేసిన వాడికి మంచినీళ్ళు కనిపించిన చందాన కనిపిస్తుంది కాబోలు. దీని కోసమే వాళ్ళు తపిస్తారు కాబోలు. అద్దెయిళ్ళకోసం తిరుగుతున్నవాళ్ళకు యిది వెదుకబోయిన తీగె కాళ్ళకు తగిలినట్టు అనుభూతి కలగిస్తూ, గిలిగింతలు పెడుతుంది కాబోలు.

అనుకున్నట్టుగానే ఆయన కలలు నిజమౌతున్నాయి. తీర్థ ప్రజలా కాకపోయినా రోజుకు ఒకరూ, యిద్దరూ యింటికి వచ్చి చూసి మాట్లాడి వెడుతున్నారు. అద్దె ముప్ఫయి రూపాయలు. ఏమాత్రం తగ్గవద్దని ఒకరిద్దరు స్నేహితులు సలహాలు యిచ్చారు. ఆ ప్రకారమే కఠినంగా ఉండటానికి మనసు కొంచెం ఎదురు తిరుగుతున్నా పాటిస్తున్నాడు. ఇద్దరు, ముగ్గురికి యిల్లు నచ్చలేదు ఇద్దరు ముగ్గురు అద్దె భరించలేమన్నారు. ఇద్దరు ముగ్గురు హిరణ్యాక్ష వరాలు కోరి, ఆయన్ని విసిగించి తిరస్కరింపబడ్డారు. తను అనుకున్న విధంగా ఎవరూ తనని

హృదయ విదారకంగా బ్రతిమిలాడక పోవటం కొంచెం బాధకరంగానే పరిణమించింది ఆయనకు. తన దగ్గరకు అటువంటి వాళ్ళు రారు కాబోలు. కొద్దిరోజులవరకు సరైనవాళ్ళెవరూ కుదరకపోతే చిరాగ్గానే ఉంది.

చివరికి ఓ ప్లీడరుగారు ఆ యింట్లో ఉండటానికి ఖాయం చేసుకున్నారు. మరో రెండురోజులకు భార్యా, ఒక యింటర్మిడియట్ చదువుతున్న కొడుకుతో సహా వచ్చి దిగాడు కూడా.

ఈ గొడవల్లో ఆయన అప్పు విషయం మరిచిపోలేదు.

నీడలా ఆ భయం అనుక్షణం వెన్నాడుతునే ఉంది ఒకళ్ళకు చెప్పుకునే బాధకాదు. భార్యకు తెలియదు. కొడుకు సంపాదిస్తున్న నూటాయాభయి రూపాయలతో సంసారం యీదుకురావచ్చు. అద్దెమీదవచ్చే ముప్ఫయి పదిలంగా దాయాలి. తను యిప్పుడు అయిదుగురు కుర్రాళ్ళకు ప్రయివేట్లు చెప్పుతున్నాడు. దానిమీద ఓ నల్భై రూపాయలు వస్తాయి. వాటిలో ఓ దమ్మిడీ ఖర్చుచేయటానికి వీల్లేదు. వీటి ద్వారానే ఆ అప్పును రద్దుచేయాలి.

ఒకరోజు సాయంత్రం అలా బజారు పని చూసుకొని వస్తూంటే బలరామయ్య కనిపించాడు. దారిలో చాలసేపు కబుర్లు చెప్పాడు.

"నీకేమిటి? అదృష్టవంతుడివి. చవగ్గా కొట్టేశావు" అన్నాడు.

లోపల సంతోషం ఉబుకుతున్నా, బయటకు తేల్చేస్తూ "ఆ ఏం చవక? పాతయిల్లు రిపేర్లు చేయడానికి మూడు నాలుగు వందలు అయింది." అన్నారు.

"ఎన్నయినా అను, అదృష్టవంతుడివి."

చిదంబరం విచారంగా నవ్వి "ఏం లాభం! దీనికోసం నీ దగ్గరే రెండువేలు అప్పుచేయాల్సివచ్చింది" అన్నాడు.

"దాని కేముంది? నీకు వీలయినప్పుడు తీర్చేద్దుగాని."

"నువ్వు కాబట్టి తాకట్టు లేకుండా అంతడబ్బు అప్పు యిచ్చావు. లేకపోతే నాపాట్లు ఉండేవి," అని చిదంబరం పదోసారో, పదిహేనోసారో, అభినందనాలు తెలియజేశాడు.

"నా విధి నేను నెరవేర్చుకున్నాను. నీమీద నాకు నమ్మకం ఆ మాత్రం లేదా?"

కృతజ్ఞత నిండిన కళ్ళతో చిదంబరం చూశాడు. మరి కొంతసేపు మాట్లాడి తనదారిన వచ్చాడు.

ఈ మధ్య భార్యకూడా ఏమీ గొడవచెయ్యటంలేదు. మనసులో ఏమి అనుకుంటుందో ఏమో కాని ఈ యిల్లు అందరి సంతోషం కోసం కొన్నప్పుడు అందరికీ కాక సంతోషం తనకు ఒక్కడికే కావటంవల్ల కొంత విచారంగానే వుంది. బయటకు ఆవేశాలు పొక్కటంలేదు. ఏనాడో ఒక నాడు మనసులో దాచుకొన్న ఈ దుఃఖాలు, ఆవేశాలు, బయటకు విరజిమ్మవుగద?

చిదంబరం ఇంటికి వెళ్ళేసరికి ప్లీడరుగారి భార్య తన భార్య హోరాహోరీగా పోట్లాడుకొంటున్నారు.

ఆ మాటలు వినటానికి విచిత్రమైనవి. తన రాకతో యిద్దరి నోళ్ళు కట్టుబడ్డాయి. వారటూ, వీరిటూ, వెంచేశారు. విశాలమైన మధ్యగదిలో కొత్తగావున్న కుర్చీమీద చిదంబరం కూలబడి "ఏమిటీ యీ దెబ్బలాట?"

"అదికాదండీ, మన పంపులో నీళ్ళు పట్టుకుంటున్నంత సేపూ వాళ్ళవైపుకు నీళ్ళేరావుట. అందుకని మనల్ని నీళ్ళు పట్టుకోకుండా వూరుకోమంటే ఊరుకొంటామా?"

"అందుకని నలుగురిలో నవ్వులపాలు అయేటట్లు అరుచుకుంటారా? అప్రతిష్ట వాళ్ళకు కాదు. మనకు, ఫలానా యింటివాళ్ళు మంచివాళ్ళు కారంటారు." "మీ కేం? అలాగే చెబుతారు. ఆవిడ మాటలు వింటూ ఊరుకోవడం నాకు చాతకాదు."

"ఏం చాతనవును? వాళ్ళింకా యింట్లోచేరి పదిరోజులు కాలేదు. అప్పుడే జగడాలా?"

భార్య గొణుగుకుంటూ లోపలకు పోయింది. తను ఎంతో కాలం అద్దె యిళ్ళలో నివసించాడు. ఎప్పుడూ పై చెయ్యిగా యింటివాళ్ళదే వుండేదిగాని తనది మాత్రం కాదు.

ఇప్పుడు ఈ యింటి యజమాని తను. ఈ ఆధిక్యత ఎందుకు నిరూపించుకో కూడదు? ఒకవేళ బానిసత్వం అలవడ్డ బ్రతుకు అధికారం చెలాయించటానికి వెనుకంజ వేసినట్లు తనూ వెనక్కి తగ్గిపోవటం లేదుకదా? మరి ఆ చొరవ రాదేం?

* * *

రోజులు గడచి పోతున్నాయి. ఆయన అనుకున్నవి సరిగ్గా ఒకటీ నెరవేరుతున్నట్లు కనబడటంలేదు. చీటికీ మాటికీ రెండువేలు అప్పు కళ్ళముందర మెదుల్తోంది. ఎవరికి తెలియని అప్పు. ఎవరికీ తెలియకుండానే తీర్చాలి. మొదట నెలకు డెబ్బయి రూపాయలు దాద్దామని అంచనా వేశాడు. కాని పాతిక రూపాయలకంటే యెక్కువ మిగలటం లేదు. ఎక్కడలేని

డబ్బు ఖర్చయిపోతోంది. తన అవసరం వాళ్ళకు తెలియక పోవటంవల్ల వాళ్ళ అవసరాలకు ఖర్చు పెట్టేస్తున్నారు. కాదని అనటానికి నోరు రావటం లేదు. పెద్దకూతురుకి ఎప్పుడైనా మూడు చీరెల కన్నా ఎక్కువ వున్నాయా? పెద్దకొడుకు ఎప్పుడయినా ఇంట్లో నూటపాతిక రూపాయలే ఇచ్చాడా? చిన్నపిల్లలు ఒక్కొక్కరికీ రెండు మూడు లాగూ చొక్కాలకన్నా ఎక్కువ వున్నాయా? ఈ మధ్య అన్నీ అధికమౌతున్నాయి. ఈ ప్రకారం బాకీ ఏ నాటికి తీర్చేటట్లు? ఈ తన బాధను ఎవరు గుర్తిస్తారు?

ప్లీడరుగారు మంచివాడేమో అని మొదట అనుకున్నాడు. ఆయన మంచితనం బొగ్గులైనట్లే వుంది. అద్దెకున్న వాళ్ళలో యింతలేసి మనుష్యులుకూడా వుంటారన్న సత్యం ఈ నాటికి బోధపడుతోంది. తనలాగే తన భార్య ఏమాత్రమో అధికారాన్ని అభిలషించి వుండవచ్చు. తనవలెనే ఆమెకూడా యిన్నాళ్ళూ అద్దెబ్రతుకు బ్రతికి విసిగి వుందికదా? ఆ మాత్రం హోదా చూపించకుండా ఎలా ఊరుకుంటుంది?

ప్లీడరుగారు లా పాయింట్లతో వేపుకు తినేస్తున్నాడు. రాను రానూ నెత్తి మీదకు ఎక్కి కూర్చుంటున్నాడు. "ఇది ఇక్కడ బాగు చేయించాలి. అది అక్కడ బాగుచేయించాలి." అని ఆయన పోరు పెట్టని రోజు లేదు. అస్తమానం స్పర్థలే. ఇదేనా శాంతి అంటే? ఇది యిలా వుండగా ప్లీడరుగారి ఇరవై యేళ్ళ అబ్బాయి తనవంక అదోరకంగా చూస్తున్నాడని కూతురు తల్లితో రహస్యంగా చెప్పిందట. ఇదేనా అద్దెకు ఇచ్చినందువల్ల వచ్చే సౌఖ్యం? ఈ దెబ్బలాటలు విని ఇరుగు పొరుగువారు గుస గుస లాడుకుంటున్నారు. తాను

రిటైరైన బడిపంతులు. ఫైలు లేకపోయినా ఆయన ప్లీడరు గారు. ఇరుగు పొరుగు ప్రజలంతా ఆయన పక్షం అవలంభిస్తున్నారు.

వీళ్ళంతా ఈ విధంగా ఎందుకు తన మీద కత్తి గడ్తున్నారో తనకు అర్థంకావటంలేదు. తన యింటి కెదురుగా ఓ క్రొత్త వెచ్చాల షాపు వెలిసింది. ఆ షావుకారు తనని యిది వరకు యిల్లడిగి తిరస్కరింపబడినవాడే. తనవంక క్రోరగా చూడటం తను దారిన పోతున్నప్పుడు వెకిలిగా నవ్వుతూ ప్రక్క వాళ్ళతో ఏదో గుసగుసలాడటం. యిదంతా చిదంబరం చాలసార్లు పసిగట్టాడు.

ఇది యిలా వుండగా బలరామయ్య ఎవరితోనో అన్నాడట. "చిదంబరం కాలాంతకుడు. పదిహేను వేలు ఖరీదు చేసే యింటిని ఆరువేలకు కొట్టేశా"డని.

"ఏమిటి ? బలరామయ్య యిలా అన్నాడా ? కనిపించినప్పుడల్లా తన శ్రేయోభిలాషిలా కబుర్లు చెబుతున్నాడే. తర్వాత బలరామయ్య చాలాసార్లు కనిపించాడు. ఇంకా శ్రేయోభిలాషిగానే కబుర్లు చెబుతున్నాడు. చిదంబరానికి నిజానిజాలు తెలియవు. అందుచేత మెదలకుండా ఊరుకున్నాడు. తనపై మరో బాధ్యత వుంది. పెద్దకూతురి పెళ్ళి చేయాలి. దమ్మిడీ కట్నం యివ్వకుండా పెళ్ళి చేస్తానని భార్య ముందు ప్రగల్భాలు కూడా పలికాడు. అది కేవలం బుకాయింపు క్రిందే తయారయింది. తనకేమి పరపతి ఉంది? తనకి యెంతో మందితో పరిచయం ఉంది. పెళ్ళికొడుకులు అని పిలువబడే యువకులు ఎక్కడెక్కడ దాక్కునివున్నారో వెతికి పట్టుకోవటం తనకు ఎలాసాధ్యం ? ఒకరిద్దరు తారసిల్లినా

కట్నాలు అడిగారు. ఒకటికాదు, రెండు కాదు, వ్యవహారం మూడు పైన ఉంది. ఎలా తూగగలడు ?

ఆనాడు బావమరిది. తన భార్యతో అంతమాట అన్నాకా యిప్పుడు మళ్ళీ మొగ్గుతాడని ఆశలేదు. ఇంకా కొంతకాలం ఊరుకొంటే వ్యవహారం చేయి కూడా దాటిపోవచ్చు. జానకికి యుక్త వయస్సు వచ్చిన మాట యెవరూ కాదనరు. తన స్థితిలో వున్నవాడికి యింకా కొంత కాలంపోతే దాని పెళ్ళి చేయటంకూడా కష్టమైన విషయంగా పరిణమిస్తుందనటంలో అబద్ధం ఏదీ లేదు. అన్నీ తెలిసే తను తప్పటడుగు వేస్తున్నాడు. కొడుకు యే విషయంలోనూ తనకు సహాయపడడు. వాడిదంతా అదో వింత ప్రకృతి. ముభావంగా ఉంటాడు. గట్టిగా అడిగితే తీరిక లేదంటాడు. తను వృద్ధుడు. ఒంటరి. చొరవలేని మనిషి. ఇన్ని విభిన్న ప్రకృతులకూ, పరిస్థితులకూ, ఏ విధంగా తట్టుకోగలడు ?

ఇన్ని సమస్యలతో ఈ మధ్య యిల్లు కదలటం కూడా మానేశాడు. రోజుకు నాలు గయిదు గంటలు ప్రయివేటు చెప్పటంలో గడిచేది. మిగిలిన కాలమంతా ఏమీ చేయక పోవటం.

ఒకరోజు పదిగంటల వేళప్పుడు పోస్టుమన్ వచ్చి ఒక ఉత్తరం అందించి వెళ్ళాడు. తాను చదివాడు.

బావమరిది రాశాడు. తన కొడుక్కి సంబంధాలు ఎక్కువగా వస్తున్నాయట. తాము ఏ విషయమూ సరిగ్గా తెలియజేస్తే దాన్నిబట్టి వేరే సంబంధం చూచుకుంటారుట. లేకపోతే ఎవరికి ఏ మాట చెప్పాలో కష్టంగా వున్నదిట.

"నీ తమ్ముడు రాశాడు" అన్నాడు ప్రక్కన నిలబడి వున్న భార్యతో.

ఆవిడ వులక లేదు పలక లేదు.

"ఏమని జవాబు యివ్వమంటావు?"

ఈసారీ పలక లేదు ఆవిడ.

"మాట్లాడ వేం ?"

మళ్ళీ మాట్లాడ లేదు అంతేగాక లోపలికి పోతూంటే ఆయన కసిగా ఆపి

"ఏమిటీ నీ వుద్దేశం ? ఇందులో నీ బాధ్యత ఏమీలే దనుకున్నా వా ?" అన్నాడు.

తల ఎత్తి భర్తముఖంలోకి ఓసారి విసురుగాచూసి "నా దేముంది? మీ కేంతో స్తే అది చెయ్యండి" అని లోపలకు వెళ్ళిపోయింది.

చిదంబరం అంతటితో వదల్లేదు - గబగబా తనూ వెనక నేపోయి ఆవిడ భుజం పట్టుకొని ఆపి, "నాకేం తో స్తే అదిచే స్తే నువ్వు సంతోషిస్తావా !" అని అడిగాడు.

"ఎందుకు సంతోషించను ? అన్నీ తెలిసినవారు."

"ఆక్షేపిస్తున్నా వా ?"

"అయ్యోకర్మ. మిమ్మల్నిఆక్షేపించేపాటి తెలివి తేటలు ధైర్యం భగవంతుడు నాకు యివ్వ లేదు."

"మరయితే ఏమిటీ ఈ మొండితనం ?"

"నేనేం మొండితనం చేశాను? అనుకుంటే సిగ్గు. చిన్న దాన్నా ? చితకదాన్నా ? అలా నాటకాలు ఆడటానికి."

"నాకు నీ వుద్దేశం తెలుసులే." అన్నాడు చిదంబరం.

"తెలి స్తే యింకా ప్రశ్నించడ మెందుకు ?"

A. Madhusudana Rao

"ఎలా అయినా ఈ సంబంధం చేసుకోవాలని ఉంది నీకు."

ఆవిడ జవాబివ్వలేదు.

"రెండు వేల అయిదువందలు ఇచ్చుకోవాలనే?"

ఆవిడ మాట్లాడలేదు.

"అప్పో సప్పో చేసి, అయినకాడికి పెళ్ళి జరిగించాలి. ఏం?"

ఆవిడ పలకలేదు.

"జవాబివ్వమని అడుగుతున్నాను."

జవాబు రాలేదు.

"జవాబివ్వడం నామర్దా అనుకున్నావా?"

ఉలకలేదు. పలకలేదు.

"మాట్లాడవేమిటి" అని ఊచిపెట్టి చెంపకాయకొట్టాడు. లోపలినుంచి, యిందాకటి నుంచి వింటూన్న పెద్దకూతురు "అమ్మా" అంటూ బావురుమంటూవచ్చి తల్లి వొళ్ళో వాలక ముందే విసవిస నడిచి బయటకు వెళ్ళిపోయాడు.

ఒక వైపునుంచి కోపం మరో వైపునుంచి ఆవేదన మరో వైపు నుంచి దుఃఖం ఒక వైపునుంచి ఆవేశం ఆ రోజంతా ఆయన్ని కాల్చుకుతిన్నాయి.

భార్యను యిదివర కెన్నిసార్లు కొట్టాడు! కాని ఆ కొట్టటానికీ, యీ కొట్టటానికి ఎంతో వ్యత్యాసం కనిపించింది. ఇది వరకు తనకు అన్నం పెట్టడం ఆలస్యమయిందని కొట్టాడు. తోకా- తిరిగితే కుట్టలేదని కొట్టాడు. సినిమాకి వెడదామని పేచీ పెట్టిందని కొట్టాడు. కాని ఇప్పుడో; కూతురి కోసం

కన్నతల్లి హృదయం రోదిస్తుంటే కొట్టాడు. ఛీఛీఛీ? పాపాత్ముడు - తను నిజంగా పాపాత్ముడే.

అయినా తన మనస్తత్వం అంత ఎందుకు అర్థం చేసుకోకపోవాలని మరుక్షణంలో కోపంకూడా వచ్చింది.

ఏమిటి అర్థం చేసుకునేది? ఏ తల్లి మాత్రం ఆ సమయంలో సహనం కోల్పోదు?

చిందర వందరగా అల్లుకుపోతున్నా యిన్ని ఆలోచనల్లలోనూ చీకటిలో మెరుపు మెరసినట్లు అయనకు ఓ ఉపాయం తట్టింది.

తన కొడుక్కి కూడా కట్నం తీసుకొంటే?

అవును ఆ డబ్బుతో కూతురి పెళ్ళి చేయవచ్చు.

కాని ఆలోచన యింకా అసంపూర్తిగా వుండగానే పెదవులపై దరహాసం యింకా ఉదయించకుండానే ఎవరో అజ్ఞాతవ్యక్తి వెన్నుమీద ఛెళ్ళున చరచినట్టయింది.

ఎంత ద్రోహం తలపెట్టాడు? తన చెల్లెలికి యింత అన్యాయం చెయ్యటానికి మనసెలా వచ్చింది? ఆమె పోతూ పోతూ తన చేత ప్రమాణం కూడా చేయించుకుంది కదా.

"ఎల్లాఅయినా ఆనందుడే నాఅల్లుడు కావాలన్నాయ్" అంది. "అలాగేనమ్మా" అన్నాడతను. ఆనాడు చనిపోతున్న ఆ అమాయకురాలికి అంత ఆశ కలిపించి యీనాడు ఆడితప్పటానికి సంసిద్ధపడతాడా? వాళ్ళు తమలాగే బీదవాళ్ళు. ఏలు లేదు. వీలులేదు. ఇంత ద్రోహం చెయ్యటానికి తన అంతరాత్మ అంగీకరించదు.

కాని తన బావమరిది తనకు యిదివరలో మాట ఇచ్చినంత పని చేశాడు. అతను ద్రోహం చేయలేదా తనకు?

అది వేరు. తను బావమరిది కాదు. అతనిలోవున్న కాఠిన్యం లేదు. పదమూడేళ్ళ పిల్ల అది. ఇంకో రెండేళ్ళలో పెళ్ళీడుకు వస్తుంది. వాళ్ళు తమ మీదనే ఆశలు పెట్టుకుని కూర్చున్నారు. ఇటువంటి స్థితిలో "కట్నం ఇవ్వందే చేసుకోను" అని తను వెల్లడిస్తే వాళ్ళ గాలిమేడలు కూలిపోవా? తన గుండె యీ రోజు మండిపోతున్నట్టే వాళ్ళ గుండెలు ఆ రోజు మండి మాడిపోవా?

లేదు, వీల్లేదు. అంత దురన్యాయం తను చేతులారా చేయలేడు. తను బాధ పడనీ, కష్టాల పాలుకానీ, చావనీ, ఆ అమాయకుల్ని బాధల పాలుచేయటం కూడదు. కనీసం కొందరైనా సుఖించాలి.

తిరిగి, తిరిగి, అలిసి, అలిసి, విసిగి, విసిగి అప్పుడు యింటి దారి పట్టినప్పుడు విద్యుత్ తగిలినట్లు మరో ఆలోచన తాకింది.

"ఈ మనశ్శాంతి లేకపోవడం, యీ మనస్పర్థలు, యివన్నీ తను యిల్లు కొన్నందుకే"

ఒక క్షణం 'నిజమేనా?' అనిపించింది.

ఎందుకు కాదు? ఆ డబ్బువుంటే కూతురి పెళ్ళి చేసేవాడు, కొడుక్కి సైకిలు కొనేవాడు. ఇంట్లో యీ కలతలు వుండేవి కావు.

తన యిల్లు కొనటమన్నమాట యిన్నిటికీ మూలమైనది.

తను యిల్లు కొనకుండావుంటే యీ అవస్థలన్నీ వుండకుండా ప్రశాంతంగా వుండేవాడన్నమాట.

అబ్బ. ఈ ధాటికి తను తట్టుకోలేడు. రానురానూ

ఓపిక సన్నగిల్లుతోంది. ఒక్క క్షణంలో 'పిచ్చి ఎత్తుతుం దేమో' అన్న భయంకూడ కలుగుతోంది.

రాత్రి చిదంబరానికి నిద్రపట్టలేదు. తెల్లవారుఝామున కాబోలు ఓ కునుకు తీశాడు. ఇంటిలో ఎవరో భుజాలమీద చేతుల్తో తట్టి లేపితే మెలకువ వచ్చింది. కళ్ళు నులుపుకుంటూ లేచాడు.

ఎదురుగుండా భార్య, ఆవిడ ముఖమంతా వివర్ణమై కన్నీళ్ళ తరువాయిగా వుంది.

"ఇదిగో చూడండీ, ఈ ఉత్తరం."

చిదంబరం గబగబా చదివాడు. అది ప్రేమలేఖ. తను జానకిని ప్రేమిస్తున్నాడట. ఆమెకోసం తన హృదయంలో విశాలమైన చోటు ఖాళీచేసి వుంచాడట. తనని కనికరించాలిట లేకపోతే బ్రతకలేడుట.

చిదంబరం కళ్ళెర్ర చేసాడు. "ఎవరి పని యిది?"

"ప్లీడరుగారబ్బాయి పనిమనిషిచేత పంపించాడు."

మారుమాట మాట్లాడకుండా ఆయన లేచి గబగబ ప్లీడరుగారి భాగంలోకి వెళ్ళాడు. ఆ సమయానికి ఆలస్యంగా లేచిన ప్లీడరు బ్రష్‌తో పళ్ళు తోముకుంటూ బయటకు వస్తు న్నాడు.

చిదంబరం ఎక్కువకాలం వ్యర్థం చేయకుండా "ఇదిగో చూడండి! మీ అబ్బాయి చేసిన ఘనకార్యం" అన్నాడు.

ప్లీడరుగారు ఆ వుత్తరం సాంతం చదివాడు. క్షణకాలం ఆయన ముఖం పాలిపోయినా, గాంభీర్యత తిరిగి వచ్చింది.

"మా అబ్బాయి యిటువంటి పన్లు చేయడే!"

"అందరి తల్లిదండ్రులూ ఇలాగే అనుకుంటారు. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నారుగా ?"

ప్లీడరు తాపీగా "మావాడు ఇంత తొందర పడ్డాడంటే ఏదో కారణం వుండి వుంటుంది కదా !" అన్నాడు.

చిదంబరం కోపం ఆపుకోలేక "ఇంకేం కారణం ? ఒకటే - యౌవన మదం" అని అరిచాడు.

"అదే ఎవరి మదం ? అని."

చిదంబరం ఒక్కసారిగా నివ్వెరపోయి "ఏమిటి ?" అన్నాడు.

"అవునయ్యా. మీ అమ్మాయి ఏమీ అలుసు యివ్వందే మావాడు యిలా తొందరపడ్డాడంటావా ?"

చిదంబరానికి మతి పోయింది. ఏమి మాట్లాడుతున్నాడో అన్నజ్ఞానం కూడా లేకుండా "పైగా యిదా ! నా యింట్లో అద్దెకుండి నాకే ద్రోహం తలపెడదామని చూస్తున్నావా ! తప్పుచేసినా దండించటం పోయి నాకే తప్పు అంటగడుతున్నావా ? ఇదేనా నీవు చేయవలసిన ప్రత్యుపకారం ?" అని అరవటం ప్రారంభించాడు.

ప్లీడరు వెంటనే సమాధానం చెప్పకుండా గంభీరమయిన మౌనం ధరించి నిల్చున్నాడు. ఈలోగా యిరుగు పొరుగు వాళ్ళు నలుగురూ అక్కడికి పోగయ్యారు.

ప్లీడరుగారు యీ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకొన్నాడు. అడిగిన వాళ్ళకు కాదనకుండా విషయాన్ని సవిస్తరంగా వివరించాడు.

ఆడపిల్లకు లోకంలో పూర్తిగా న్యాయం జరుగుతుందని ఎవరయినా అంటే వాళ్ళు యీ సమయంలో అక్కడ నిల్చుని జరిగేది పరికించవచ్చు. ఆడపిల్ల తండ్రి మీద కూడా లోకం యింత కఠినంగా యెదురు తిరుగుతుందని కలలోకూడా తలపోయలేదు.

"ఆ అమ్మాయి విషయం నాకు బాగా తెలుసును" అని ఒకరన్నారు.

"గుమ్మంలో నిల్చుని వచ్చేపోయే వాళ్ళవంక ఒకటే యిదిగా చూపులు"

"ఆ అబ్బాయి తొందరపడ్డాడంటే అతనిదేం తప్పు?"

"ఆ స్థితిలో యెవరున్నా అలాగే చేస్తారు."

చిదంబరానికి మతి చెడింది. ఈ స్థితిలో తనకన్నా శవం నయం, ఒక్కమాట ఆయననోటినుంచి వెలువడలేదు. ఆవేశం, ఆగ్రహం ఎప్పుడో ఎగిరిపోయాయి! మిగిలింది ఒకటే- అవమానం.... అవమానం....

వెనక్కి తిరిగాడు.

వెనక నుంచి యెకయెకలు, పకపకలు.

లోపలకు వస్తుంటే గదిలో పడుకుని యేడుస్తున్న పెద్ద కూతురు, గోడకు ఆనుకుని కళ్ళు మూసుకుని నిల్చున్న భార్యా, కుర్చీలో తల పట్టుకుని కూర్చున్న పెద్ద కొడుకూ లీలగా కనిపించారు. అంతే, పోయి చాపమీద పడ్డాడు.

తొమ్మిదయినా లేవలేదు. పదయినా లేవలేదు. పదకొండు, పన్నెండు. వొంటిగంటయినా లేవలేదు.

చివరకు పాదాల మీద మెత్తగా తగిలితే యెర్రబడ్డ కళ్ళు విప్పి బలహీనంగా చూశాడు.

“మీ పాదాల మీదపడి ప్రాధేయపడుతున్నాను. అమ్మాయి పెళ్ళి అయ్యే మార్గం చూడండి.”

చిదంబరం ఉలకలేదు. పలుకలేదు.

“డబ్బుకోసం చూడకండి. దాని జీవితం నాశనం చేయకండి.”

చిదంబరం మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. ఆవిడ మరో పది నిమిషాలు అలానే పడివుంది. భారంగా లేచి లోపలకు వెళ్ళిపోయింది.

ఆలోచన. మౌనం. బాధ, ఆ రోజు నుంచి చిదంబరానికి ఇదేపని : ఇల్లు - పెళ్ళి, పెళ్ళి - ఇల్లు - ఇదే ధ్యాస.

ప్లీడరు మరో రెండు రోజుల్లో ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయాడు. కొన్ని రోజులు ఆ భాగం అలా ఖాళీగా పడివుంది.

తనభాగం అది. దాని అద్దె వృథాగా పోతోంది. అంత బాధలోనూ వెళ్ళి, పాత బోర్డు దులిపి దానికి తగిలించి వచ్చాడు.

“ఈ భాగము అద్దెకు ఇవ్వబడును.”

లోపలకు వస్తూంటే యెదుటి షాపులోని షావుకారు నవ్వినట్లు వినిపించింది. అయినను లెక్క చేయకుండా లోపలకు వచ్చేశాడు.

ఇదీ మరీ విచిత్రం. ఈసారి ఇంట్లో అద్దెకు వుండేందుకు యెవరూ రావటంలేదు. ఒకరిద్దరు వచ్చి అద్దె యెక్కువయిందని వెళ్ళిపోయారు ఒకరిద్దరు ఇల్లు బాగాలేదని వెళ్ళిపోయారు. ఒకరిద్దరు వచ్చి చేరుతామని చెప్పిరాకుండా మాయమయ్యారు.

ఇంకా మరీ విచిత్రమైన సంగతి-ఒకరిద్దరు వచ్చి ఇంట్లో ఒకటి రెండురోజులుండి, "అబ్బే దెయ్యాల కొంపలా వుంది" అని వెళ్ళిపోయారు.

ఎప్పుడైనా చిదంబరం కిటికీలోంచి బయటకు చూసి నప్పుడు ఎదురి షాపులోనుంచి షావుకారు విషపు నవ్వుతో ప్రత్యక్షం.

ఈ నవ్వుకూ ఆ విచిత్రానికి యేమీ సంబంధం లేదు గదా!

ఇదేనా చివరకు ఫలితం! ఇందుకోసమేనా ఇల్లు కొన్నాడు? ఈ యింట్లో సుఖంలేదు, శాంతిలేదు. ఈ ఇంటో అధికారం చెలాయించే హక్కు లేదు. కనీసం మాట్లాడేవారు లేరు ఈ ఇంట్లో ఎప్పుడూ కన్నీళ్ళు. ఎడమొహాలు, పెడ మొహాలు.

ఒకవేళ....ఒకవేళ.... ఈ ఇంటికన్నా ఆ పాతయిల్లే నీళ్ళు కురిసే ఆ యిల్లే నయమేమో.

అవును. కన్నీళ్ళకన్నా అదే నయంకదూ!

ఆ ఇంట్లో వుంటే ఇంతటి విరోధానికి గురికాడు. ఇన్ని కక్షలుండవు. ఇంతకంటే మనశ్శాంతి హెచ్చు. కూతురి పెళ్ళికి అడ్డువుండదు.

కూతురి పెళ్ళికీ, ఇల్లు కొనడానికి సంబంధం?

అంటే....అం....టే ఇల్లు అమ్మడానికి కూతురి పెళ్ళికీ కూడ సంబంధం. వళ్ళు ఝల్లుమంది. ఇల్లు అమ్మటం ఇల్లు అమ్మటానికేనా కొన్నాడు.

అంతేకాక చిదంబరానికి తనుచేసిన రెండువేల అప్పు మనోనేత్రం ముందు గోచరించింది. ఇంతవరకూ తీర్చింది

వడ్డీకి కూడా సరిపోదు. రెండువేలూ, రెండువేలూగా నేవుంది. ఆరోగ్యం పూర్తిగా పాడయింది. ఈ స్థితిలో ఏం కష్టపడి ఆ బాకీ తీర్చేందుకు ప్రయత్నిస్తాడు? కలలోని మాట. ఇంకా కొన్నాళ్ళుపోతే చేసిన అప్పుకోసమే యిల్లు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఏ యింటికోసం అప్పుచేశాడో ఆ అప్పుకోసం ఆ ఇంటిని అమ్ముతున్నాడు. భరించలేడు. ఈ ధాటికి తట్టుకోలేడు.

బావమరిదినుంచి బెదిరిస్తూ వచ్చే వుత్తరాల ధాటికి తట్టుకోలేడు.

హఠాత్తుగా ఓరోజు దృఢనిశ్చయంతో చిదంబరం లేచాడు. ఏడిచే భార్యా, ఏడిచే కూతురు హృదయంలో చెరిసగం పంచుకున్నారు. బలరామయ్య ఇంటికేసి ఫర్లాంగు దూరం నడిచేసరికి కళ్ళు తిరిగాయి. శరీరం తూలింది రిక్షాలో ఇంటికి తిరిగివచ్చాడు.

ఆరోజేఅనుకుంటే మర్నాడుకూడా లేవటం కష్టమైంది. లోపలినుంచి పొంగిపొర్లే ఉత్కంఠను అణుచుకోవడం కష్టం కాగా, చిన్నకొడుకును బలరామయ్య యింటికి కబురు పంపించాడు.

మరోగంటలో "ఎందుకు చిదంబరం, పిలిపించావట" అంటూ బలరామయ్య వచ్చాడు.

"కూర్చో" అని చిదంబరం సౌంజ్ఞ చేశాడు. మళ్ళీ కొంచెం ఆగి "ఆ తలుపులు వేసెయ్యి" అన్నాడు.

బలరామయ్య తలుపులువేసివచ్చి చిదంబరానికి చేరువలో కూర్చున్నాడు.

"నా ఇంటిని అమ్ముతున్నాను?"

"ఇదేమిటి? ఎందుకు?"

"అంతే. అలా కావలసి వచ్చింది. పదిమందిలో బేరం పెట్టి ధర పెంచేటంతటి ఓపిక లేదు. నా ఇల్లు కొనటం నీ కిష్టమేనా?"

ఈ మాటలు అంటుంటే జరిగిపోయిన దేదో తప్పు మనస్సులో స్ఫురించింది. చరిత్ర తిరుగుతోంది.

బలరామయ్య కొంచెం ఆలోచించి "నాకు ఇష్టంలేని మాట నిజమేకానీ డబ్బు నీకు నిజంగా అవసరమైతే అలాగే చేద్దాం" అన్నాడు.

"ఈ ఇల్లు చాల ఖరీదు చేస్తుందని ఒకనాడు నువ్వు నాతో అన్నావు, కాని నేనేమీ లాభాలు ఆసించటలేదు. కొన్న ధరే ఇచ్చి తీసుకో."

బలరామయ్య వెంటనే ముఖం చిట్లించాడు. "ఇప్పుడు ఇళ్ళ ధరలు పడిపోయాయి. అదీగాక నా దగ్గర అంత డబ్బెక్కడిది?" అన్నాడు.

"ఎంత ఇస్తానంటావ్?"

"అయిదు వేల కన్నా నేను దమ్మిడీ యెక్కువ ఇవ్వలేను."

చిదంబరం పెదవులు వణికాయి. "నేను అన్ని విధాలా నాశనం అవుతున్నాను. నన్ను ద్రోహం చేయటానికి ప్రయత్నించబోకు బలరామయ్యా" అని గొణిగాడు.

బలరామయ్య కొంచెం ఆలోచించి "ఇంకో అయిదు వందలు. అంతకంటే నాకు శక్తి చాలదు" అన్నాడు. చిదంబరం అయిష్టంగా తలవూపాడు.

బలరామయ్య వెంటనే లేచి నిలబడి "అయితే నీ ఇష్టం.

నాశక్తి నేను చెప్పాను. నిన్ను నష్టపెట్టుకోమని ఎవరన్నారు? వేరే ఎవరిదగ్గరైనా లాభం వచ్చేదాకా ప్రయత్నించిచూడు" అంటూ వెళ్ళిపోసాగాడు.

చిదంబరం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆగమని సౌంజ్ఞ చేసి "అయితే రేపే అన్నిఏర్పాట్లూ చేస్తావుగా!" అన్నాడు.

"నేను చెప్పిన ధర యిష్టమేనా?"

చిదంబరం తలవూపాడు.

"రేపు వస్తాను" అని బలరామయ్య వెళ్ళిపోయాడు. "అదృష్టం పండింది. నా బాకీ కోసం రిజిష్టరు నోటీసు ఇవ్వకుండానే సులభంగా పని జరిగిపోయింది" అని వెళ్ళిపోతూ మనసులో ఊహించుకుని ఆయనసంతోషించడం అసహజమని ఎవరూ అనరు.

మూడురోజుల్లో ఇంట్లో యెవరికీ తెలియకుండానే పని సక్రమంగా జరిగిపోయింది. బాకీ తీరిపోను చిదంబరానికి మూడువేల రెండు వందలు మాత్రం చేతికి వచ్చింది.

ఆయనలో బలహీనత నానాటికీ ఎక్కువయి పోతోంది. కదలడం కూడా కష్టంగా వుంది. ఆ రాత్రి ఆయన చాలా రోజులు తర్వాత భార్యను ప్రేమతో దగ్గరకు పిలచాడు.

"ఇదిగో ఇలారా."

ఆవిడ చెంతకు వచ్చి నిల్చుంది.

"ఇలా కూర్చో."

కూర్చుంది.

"నా పరుపు క్రింద డబ్బు వుంటుంది చూడు." ఆయన మాట తడబడుతోంది, ఆవిడ తడిమి తీసింది.

"మూడు వేల.... రెండు....వం....ద....లు."

"ఎక్కడిదండీ ?"

"ఇల్లు అమ్మాను"

ఆవిడ పమిట చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

"అమ్మాయి పెళ్ళి సలక్షణంగా జరుగుతుంది. వాళ్ళకు ....కట్నం....ఇస్తామని ఉత్తరం....వ్రాయించు"

తరువాత కొద్ది సేపటిలో స్మారకం తప్పింది. పెద్ద కొడుకు వెళ్ళి డాక్టరును పిల్చుకువచ్చాడు. ఆయన పరీక్షచేసి "యింత ఆలస్యం ఎందుకు చేశారు ? చాలా ప్రమాద స్థితిలో వున్నాడు" అని చెప్పాడు.

'ఏమిటి ?" ఇల్లంతా ఓసారి ఉలిక్కి పడ్డది.

"అవును నా చేతనయినంత వరకూ ప్రయిత్నిస్తాను."

ఆ రోజూ, మరునాడు గడిచింది. మూడో దినం తెల్లవారు ఝామున రోగిచుట్టూ అంతా కూర్చున్నారు. ఇద్దరు ముగ్గురు బంధువులు కూడా వున్నారు. ఉన్నట్లుండి ఆయనకు గురక పుట్టింది.

"అమ్మా" అంటూ తల్లి వళ్ళో తలపెట్టి బావురు మంటోంది పెద్దకూతురు.

సరిగ్గా ఆ సమయానికే బలరామయ్యగారి మనుష్యులు ఇద్దరు వచ్చారు.

"ఇంట్లో చచ్చిపోవటానికి వీల్లేదు. బయటపెట్టాలి."

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. పెద్ద కొడుకు కళ్ళు తుడుచుకొని బంధువుల సహాయంతో రోగిని బయట చలిలోకి తీసుకుపోతుంటే "తల్లీ" అంది ఆవిడ కూతుర్ని బిగ్గరగా కౌగలించుకొని ఏడుస్తూ.